# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 11-06-2019**

గ్రామాల, పట్టణాల గుణాత్మక అభివృద్ధిలో పంచాయతీరాజ్ మున్సిపల్ చట్టాల పటిష్ట అమలు కీలకమని, ప్రజలకు సుపరిపాలన అందించడం కోసం ఉన్న చట్టాలను సవరించుకుంటూ మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం వున్నదని, తద్వారా ప్రజలకు గ్రామాలు మున్సిపాలిటీ స్థాయిల్లో సుపరిపాలన అందించగలుగుతామని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు తెస్తున్న నూతన పంచాయతీరాజ్ చట్టం అమలు కోసం కార్యాచరణ, నూతన మున్సిపాలిటీ చట్టం రూపకల్పన పై సోమవారం ప్రగతిభవన్ లో సమీక్షా సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో మంత్రులు శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీ కొప్పుల ఈశ్వర్, శ్రీ శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్సీ శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీ ఆరూరి రమేశ్, ప్రభుత్వ సలహాదారు శ్రీ రాజీవ్ శర్మ, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీ నర్సింగ్ రావు, శ్రీ భూపాల్ రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ అరవింద్ కుమార్, కమీషనర్ శ్రీమతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ “పంచాయతీ రాజ్ చట్టాన్ని పటిష్టంగా రూపొందించిన పద్దతిలోనే, అవినీతి రహితంగా పాలన అందే విధంగా, ప్రజలకు మేలు జరిగేవిధంగా మున్సిపల్ చట్టం రూపకల్పన చేయాలి. నూతన పంచాయతీ రాజ్ చట్టానికి పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలి. ‘మనం మనుసు పెట్టి పనిచేస్తే గ్రామాలు మున్సిపాలిటీ స్థాయిల్లో కావాల్సినంత పని వున్నది. ప్రజా ప్రతినిధులు కానీ అధికారులు కానీ ఈ విషయాన్ని గ్రహించాలి. ఇక్కడ పని వదిలి ఇంకెంక్కడనో వున్నట్టు నేల విడిచి సాము చేయవద్దు. విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన నుంచి గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతతో పాటు ఇతర మౌలిక రంగాల అభివ్రద్ధి చేపట్టాల్సిన బాధ్యత మనమీదున్నది. మున్సిపాలిటీలు దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు మేలయిన పాలన అందించవలసిన విషయాన్ని మనం గమనించాలి.

ఇందుకు సంబంధించిన చట్టం అమలు విషయంలో అటు ప్రభుత్వ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా బాధ్యులను చేస్తూ పకడ్బందీగా మున్సిపల్ చట్టాన్ని రూపొందించాలి. మున్సిపల్ చట్టాన్ని ఎంత మెరుగ్గా రూపొందించగలుగుతే ప్రజలకు అంత గొప్పగా సేవలందించగలుగుతాం” అని సీఎం అధికారులకు సూచించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**